క్లుప్తంగా

వైద్య శిబిరం రేపు

నరసన్నపేట: స్థానిక కోవెల వీధిలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం సెప్టెంబర్ ఒకటో తేదీన నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ప్రభాకరరావు, బి.మోహనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు కిమ్స్ ఆస్పత్రి వైద్యులు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయుర్వేదిక్ మందులపై అవగాహన శిబిరం ఉంటుందన్నారు. విశ్రాంత ఉద్యోగులు అందరూ వచ్చి తనిఖీలు చేయించుకోవాలని కోరారు.

ఈ-క్రాప్ నమోదు పూర్తిచేయాలి

ఎల్.ఎన్.పేట: ఈ క్రాప్ నమోదు ప్రక్రియ సకాలంలో పూర్తిచేయాలని ఏఓ పైడి లతశ్రీ సిబ్బందికి సూచించారు. మండలంలోని తన కార్యాలయంలో గ్రామ సచివాలయ సహాయకులతో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటివరకు రెవెన్యూ గ్రామాల వారీగా జరిగిన ఈ-క్రాప్ నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాల్లోనూ ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలన్నారు. రైతులతో కలిసి పంట పొలానికి వెళ్లి ప్రస్తుతం సాగులో ఉన్న పంట ఫొటో తీసి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ-క్రాప్ నమోదులో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధర్మాన అప్పారావు మృతికి పలువురి సంతాపం



నరసన్నపేట: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి, ధర్మాన సోదరుల పెద్దనాన్న కుమారుడు ధర్మాన అప్పారావు అనారోగ్యంతో బుధవారం శ్రీకాకుళంలో మృతి చెందారు. స్వగ్రామం మబగాంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈయన మృతికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ సీనియర్ లీడర్ ధర్మాన రామదాస్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ధర్మాన సోదరులు అప్పారావు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



బీమా మొత్తం అందజేస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని నెయ్యిల వీధికి చెందిన ఎం.ఆనందరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య సునీతకు వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా తక్షణ సహాయం రూ.10 వేలను సర్పంచ్ బూరల్లి శంకర్ బుధవారం అందజేశారు. నిబంధనల మేరకు రూ. 10 వేలను ఇచ్చారు. ఎంపీటీసీ డేవిడ్, పంచాయతీ వార్డు సభ్యులు కేసీహెచ్‌బీ గుప్త, పొట్నూరు కృష్ణ ప్రసాద్, బీఎల్ శర్మ తదితరులు ఉన్నారు.

కంటి విభాగాన్ని వినియోగించుకోవాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: స్థానిక వంద పడకల ఆస్పత్రిలో కంటి వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి తనిఖీలకు సంబంధించి అన్ని సౌకర్యాలు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్నాయన్నారు.

ఉపాధ్యాయుడికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంట స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న యాళ్ల రామ వెంకట సత్యానంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నరసన్నపేట మెయిన్ రోడ్డులో గల పైడితల్లి కూడలి సమీపంలో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన ఉపాధ్యాయుడుని నడగాం గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి గొట్టి ధర్మారావు నరసన్నపేటలోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌కు తరలించి చికిత్స అందించారు. ధర్మారావును స్థానికులు అభినందించారు. గాయపడిన ఉపాధ్యాయుడు కోలుకుంటున్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేయలేదు.

ప్రజాసంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

సరుబుజ్జిలి: ప్రతి కుటుంబానికీ సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం స్పష్టంచేశారు. మండలంలోని ఇస్కలపాలెం, సుబ్బపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. స్పీకర్‌ను ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించి, భవిష్యత్‌లో ప్రభుత్వం చేపట్టనున్న పథకాల గురించి స్పీకర్ తెలియజేశారు. ప్రజలు చెప్పిన సమస్యలను అధికారులతో చర్చించి క్షేత్రస్థాయిలోనే పరిష్కరించారు. సీఎం జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. మరలా మిమ్మల్ని ఎమ్మెల్యేగా, జగనన్నను ముఖ్యమంత్రిగా చూడాలని తమ కోరికని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు. కుల, మతాలకు పార్టీలతో సంబంధం లేకుండా గ్రామ సచివాలయం, గ్రామ వలంటీర్ల ద్వారా పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించడం చరిత్రాత్మకమని కొనియాడారు. టీడీపీ నాయకులు కళ్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసగించారే తప్ప, ఏనాడైనా ప్రజల సంక్షేమం కోసం పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, బూత్ కన్వీనర్ మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ అత్తులూరి రవికాంత్, ఏఎంసీ మాజీ చైర్మన్ బద్రి రామారావు పాల్గొన్నారు.

మీ వెంటే మేముంటాం



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న సంఘం నాయకులు

- ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను కలిసిన శిష్టకరణ సంఘం నాయకులు

పోలాకి: మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసేందుకు మీవెంటే మేముంటామని శిష్టకరణ సంఘ నాయకులు అన్నారు. రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షత బాధ్యతలు చేపట్టిన నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను మబగాంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సదాశివుని కృష్ణ మాట్లాడుతూ శిష్టకరణాలతోపాటు ఎన్నో వెనుకబాటు కలిగిన కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, వారి ఉనికిని గుర్తించి, గౌరవించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోవటానికి తామంతా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మూడోసారి జిల్లా పార్టీ రథసారథిగా నియమించబడిన కృష్ణదాస్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సదాశివుని ప్రభాకరరావు, అంపలాం వసంత కుమార్, ఎం.వి.జె.మోహనరావు, ఆర్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- సుభద్రాపురంలో ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన



సుబ్బపేటలో కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: ప్రతి ఇంటికీ తాగునీటిని అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండంలోని సుబ్బపేటలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా నిర్మించనున్న ఇంటింటికీ తాగునీటి కుళాయి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సీఎం జగన్ గత ఎన్నికల ముందు చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రలో తాగునీటి కోసం మహిళలు పడుతున్న కష్టాలను స్వయంగా చూసి ప్రతి ఇంటికీ తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బద్రి రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

బూర్జ: మండలంలోని లచ్చయ్యపేట నీలమణి దుర్గ అమ్మవారి సన్నిధి వద్ద బుధవారం భారీ అన్న సమారాధన నిర్వహించినట్లు వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, స్థానిక సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు సూరపు ఉదయకుమార్ తెలిపారు. అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు లింగరాజు ఉపేంద్ర ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 28న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్కుపురంలో వైద్య శిబిరం

బూర్జ: మండలంలోని లక్కుపురం గ్రామంలో మన్యం జిల్లా పాలకొండలో గల శ్రీవిజయ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ కర్నేన దీప బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రముఖ వైద్య నిపుణులు హాజరవుతారన్నారు. గర్భిణులకు, చిన్నపిల్లలకు, కీళ్ల నొప్పులు, ఆర్థో వంటి దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకమైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలియజేశారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేవలే గుర్తింపునిస్తాయి

హిరమండలం: ఉద్యోగికి తాను చేసిన సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని ప్రభుత్వ జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ పీఈఎస్ పట్నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీవిరమణ పొందిన ప్రసాద్‌రావును బుధవారం సన్మానించారు. అలాగే సైన్స్ అధ్యాపకునిగా పనిచేసి నరసన్నపేట బదిలీపై వెళ్లిన జె.వదన గిరిని సత్కరించారు. బదిలీపై ఇక్కడకు వచ్చిన సైన్స్, మాథ్స్ అధ్యాపకులు ఎస్.సూర్యకుమారి, సుధాకర్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరటితోటల పెంపకంపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

సరుబుజ్జిలి: పెరటితోటలు అధికంగా పెంచాలని రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్, సునీత, శిల్ప తెలిపారు. బుధవారం ఇస్కలపాలెం గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెరటితోటల పెంపకంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రాజారావు పాల్గొన్నారు.

బోధనలో మెలకువలు అవసరం



నరసన్నపేట: మాట్లాడుతున్న ఎంఈఓ శాంతారావు



హిరమండలం: మాట్లాడుతున్న ఎంఈఓ రాంబాబు

నరసన్నపేట: స్కూళ్లలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులు, చేర్పులు, పాఠ్యాంశాల బోధనలో మెలకువలు, నూతన విద్యా విధానం వంటి వాటిపై ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన కల్పించేందుకు స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులు అందరూ దృష్టి పెట్టాలని, నిర్లక్ష్యంగా ఉండవద్దని ఎంఈఓ శాంతారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బోర్డు ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభమైన సబ్జెక్టు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను పరిశీలించారు. ఉత్తమ ఫలితాల సాధనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బోధనా సామర్థ్యం మరింత పెంపు..

హిరమండలం: ప్రతీ నెల చివరి వారంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల ద్వారా పాఠశాలల్లో బోధనా సామర్థ్యం మరింత పెరుగుతుందని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ ముగింపు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బోధన విధానాల్లో భాగంగా ప్రతీ ఉపాధ్యాయుడు సాంకేతిక విధానాల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ టి.కేశవరావు, ప్రొగ్రాం రిసోర్స్‌పర్సన్ పి.మల్లేశ్వరరావు, సీఆర్ఎంటీ టి.ధనుంజయరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు లక్ష్మణరావు



మాట్లాడుతున్న లక్ష్మణరావు

హిరమండలం: వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతోనే ఉండాలని తద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక ప్రేమసాయి వృద్ధాశ్రమాన్ని బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఈ ఆశ్రమం ఆదర్శంగా ఉందన్నారు. ఆశ్రమవాసులు నిరంతరం భగవాన్ నామస్మరణ చేస్తూ జీవనం కొనసాగించాలని సూచించారు. సెప్టెంబర్ 14, 15 తేదీల్లో రాష్ట్ర స్థాయి యువజన సమ్మేళనం విశాఖపట్టణంలో నిర్వహించనున్నామన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి యువత, భక్తులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆశ్రమంలోని వృద్ధులకు సేవచేయడానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి సేవాదళ్ సభ్యులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ వృద్ధాశ్రం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం అధ్యక్షుడు అంధవరపు అబ్బాయి, సమన్వయకర్త సాయిబాబా, సభ్యులు చంటి మాస్టర్, గోవిదం శర్మ, మేనేజర్ జయరామ్, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

పోలాకి: మండలంలోని తలసముద్రంలో ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించన శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల పోస్టర్‌ను బుధవారం పోలాకి ఎస్ఐ వి.సత్యనారాయణ ఆవిష్కరించారు. సెప్టెంబర్ 6వ తేదీ నుంచి 15 వరకు జరిగే ఈ కార్యక్రమానికి ఆహ్వాన కమిటీ ఏర్పాటు, ఊరేగింపు అనుమతులు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక స్థానిక కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• జోరుగా రాఖీల విక్రయం



రాఖీ పండగ సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం రాఖీల విక్రయం జోరుగా సాగింది. గురువారం రాఖీ పండగ కావటంతో రాఖీలు కొనుగోలు చేసేందుకు మహిళలు అధిక సంఖ్యలో ఎల్.ఎన్.పేట మండల కేంద్రానికి వచ్చారు. కరోనా తరువాత ఈ ఏడాది రాఖీలు ఎక్కువగా విక్రయించామని స్థానిక వ్యాపారులు చెప్పారు. - ఎల్.ఎన్.పేట

ఓటర్ల జాబితా పరిశీలన



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పాతపట్నం నియోజకవర్గానికి సంబంధించిన ఐదు మండలాల ఓటర్ల జాబితాలను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో పరిశీలించారు. తొలగింపులు, చేర్పులకు సంబంధించి పత్రాలు సక్రమంగా ఉన్నది, లేనిది, ఫిజికల్ డాక్యుమెంట్లు తనిఖీ చేశారు. బూత్ స్థాయి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సమాజ సేవ చేస్తా

- లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్

శ్రీకాకుళం అర్బన్: సమాజ సేవ చేస్తానని లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. శ్రీకాకుళంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమానికి జిల్లా నుంచి విచ్చేసిన ప్రముఖులు, మేధావులు, లయన్స్ క్లబ్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ తరపున రైతులకు సూచనలు, సలహాలు, మత్స్యకారులు వేటకు వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు, గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు తదితర వాటిని చేపట్టనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 5వ తేదీన గురుపూజోత్సవం, 15వ తేదీన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకుని ఇంజనీర్ల దినోత్సవం, వినాయక చవితి పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ, పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తదాన శిబిరాలు నిర్వహణ తదితర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు నటుకుల మోహన్, డాక్టర్ బాడాన దేవభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి పౌష్టికాహార వారోత్సవాలు



మాట్లాడుతున్న ఆర్జేడీ చిన్మయిదేవి

గార: సెప్టెంబర్ ఒకటి నుంచి జరగనున్న పౌష్టికాహార వారోత్సవాలను పక్కాగా నిర్వహించాలని ఐసీడీఎస్ ఆర్జేడీ జి.చిన్మయిదేవి అన్నారు. జిల్లా పర్యటనలో ఉన్న ఆర్జేడీ బుధవారం జొన్నలపాడులో జరుగుతున్న సెక్టార్ సమావేశంలో పాల్గొన్నారు. వారోత్సవాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లేదనన్నారు. రికార్డులు తనిఖీ చేసి పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలకు టీహెచ్‌ఆర్ సరుకులు కచ్చితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతిమయి, అంగాన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



అధికారులకు సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం సమావేశమైన ఆమె నిర్మాణ దశలోని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణదారులకు కావాల్సిన నీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో చేపడుతున్న సచివాలయ, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను పూర్తి చేయాలన్నారు.

'హెల్పింగ్ హ్యాండ్స్'కు అవార్డు



అశోక్ అవార్డుందుకుంటున్న శ్రీధర్

హిరమండలం: భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వారు శ్రీకాకుళంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా హిరమండలం హెల్పింగ్ హ్యాండ్స్ సోసియేషన్ చేసిన సేవలను గుర్తించారు. ఈ మేరకు 'అశోక్' అవార్డును సంస్థ అధ్యక్షుడు పోతురాజు శ్రీధర్‌కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు